సీఎం జగన్ పాలనలోనే మహిళల అభ్యున్నతి

• ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


కురపల్లిలో సన్మానించిన మహిళలతో రవికుమార్


భీమిలిలోని క్యాంప్ కార్యాలయంలో మహిళను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: మహిళలకు అన్ని రంగాల్లోను గౌరవ ప్రదమైన స్థానాన్ని కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఇక్కడి క్యాంపు కార్యాలయంలో బుధవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రివర్గంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం స్థానాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు కేటాయించడం గొప్ప విషయమన్నారు. సంక్షేమ పథకాల్లో ఇంటి పట్టాలు, అమ్మఒడితో పాటు మరికొన్ని వారికే అందేవిధంగా చూస్తున్నారని కొనియాడారు. మహిళల స్వయం ఉపాధికి అన్ని విధాలుగా చేయూత అందిస్తున్నామని, ఆడపిల్లల చదువు కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. జ్యోతీరావు పూలే, అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం పలు రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను సత్కరించారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, వైఎస్సార్‌సీపీ మహిళ నేతలు మైలిపల్లి భారతి, శిల్ల సరళారాణి, జీరు సుజాత, చిల్ల ప్రమీల పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలకు అవగాహన అవసరం

తగరపువలస: మహిళలు నిత్యం ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సమాజ అభివృద్ధికి సహకరించగలరని ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ లీల సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో వివిధ ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొందుతున్న మహిళలకు ఆరోగ్యంపై, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన కలిగించారు. మహిళల పట్ల వివక్ష తగ్గుతుండటం వల్ల అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంపొందించడానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో దివీస్ డైరెక్టర్ మధుసూదనరావు, జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, అధికారులు ఇ.ఎస్. నాగరాజు, డి.సురేష్‌కుమార్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

• చిట్టివలస సిటు కార్యాలయంలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. సీపీఎం, సిటు నాయకులు పాల్గొన్నారు.

మహిళలను గౌరవించడం మన సంప్రదాయం

ఆనందపురం : మహిళలకు సమాజంలో గౌరవప్రదమైన స్థానం కల్పించడానికి అందరూ కృషి చేయాలని శొంఠ్యాం పంచాయతీ కార్యదర్శి సత్య ప్రసాద్ అన్నారు. పంచాయతీ కార్యాలయంలో విశ్వ ఆయుర్వేద పరిషత్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించి మహిళలకు పరీక్షలు చేసి వైద్యరత్న ఫార్మసీ ఉచితంగా సమకూర్చిన మందులను అందజేశారు. యోగ శిక్షకుడు బాలభాను వెన్ను నొప్పి, మోకాలు నొప్పి నయం చేసుకోవడానికి యోగాసనాలు వేసి చూపించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు లెంక రాంబాబు, విశ్రాంత ఆయుర్వేద వైద్యుడు ఉమా మహేశ్వరరావు తదితరులు వైద్యురాలు పద్మావతి, ఆరోగ్య కార్యకర్త గొర్లె సత్యవతిని సత్కరించారు.

కొమ్మాది: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గీతం వుమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. గైనకాలజిస్టు, హెయిర్ క్లీనిక్ డాక్టర్ ఎమ్.ఎస్.పల్లవి మాట్లాడుతూ గృహిణిగా, పారిశ్రామికవేత్తగా, శాస్త్రవేత్తగా, అధ్యాపకురాలిగా మహిళలు బహుముఖ ప్రజ్ఞను కనబరుస్తున్నారని కొనియాడారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతూ మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. డాక్టర్ గీతాంజలి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గుణశేఖరన్, శిల్పాంజలి పాల్గొన్నారు.


శొంఠ్యాంలో మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయురాలు డి.సీతారత్నం, డాక్టర్ కె.పూర్ణిమ, డాక్టర్ కె.హరిణి, అంతర్జాతీయ వెటరన్ క్రీడాకారిణి లావణ్యను ట్రస్టు చైర్మన్ రూపాకుల రవి కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉప్పాడ అప్పారావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, మహంతి అప్పల రమణ పాల్గొన్నారు.

మధురవాడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఆట, పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఎమ్‌వీపీ సిటీతోపాటు అపార్ట్‌మెంట్లలో ఆనందోత్సాహాలతో కేకులు కట్ చేశారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్ఎస్‌వీ పల్లవి



దివీస్ లేబొరేటరీ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో..

సీఎం జగన్ వల్లే భారీ పెట్టుబడులు

భీమునిపట్నం: విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే భారీ పెట్టుబడులు వచ్చాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.13 లక్షలకుపైగా పెట్టుబడులు రావడం, దిగ్గజ పారిశ్రామికవేత్తలు సమ్మిట్‌కు రావడంతో ప్రతిపక్షాలకు దిక్కుతోచకుండా పోయిందన్నారు. విశాఖ పరిపాలన రాజధాని కానున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందడంతోపాటు వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. భారీ పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరినప్పటికీ కొందరు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, వారి మాటలను ప్రజలు నమ్మడం ఎప్పుడో మానేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలుపల్లి కొండబాబు, నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, మైలిపల్లి షణ్ముఖరావు, అల్లిపిల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

మృతుడు అన్నంపేట నివాసి

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి నూకాంబిక చెరువు సమీపంలో పొట్నూరు రోడ్డులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి రేవిడి పంచాయతీ అన్నంపేట గ్రామానికి చెందిన కర్రి బంగారయ్యగా గుర్తించినట్టు సీఐ సన్యాసినాయుడు తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. పొట్నూరులో జరిగే పరదేశమ్మ ఉత్సవాలకు అదే గ్రామానికి చెందిన సంపంగి శ్రీనివాసరావు బైక్‌పై పద్మనాభం జంక్షన్ నుంచి కర్రి బంగారయ్య బయలుదేరాడు. మార్గ మధ్యలో నూకాంబిక చెరువు వద్ద పొట్నూరు నుంచి బైక్‌పై వస్తున్న తునివలస గ్రామానికి చెందిన నెయ్యి గోపాలస్వామి శంకర్, కోరాడ కుమార్ ఢీకొట్టారు. దీంతో తీవ్ర గాయాలపాలైన బంగారయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో మిగిలిన ముగ్గురికీ గాయాలయ్యాయి. వీరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుడు బంగారయ్యకు భార్య వర్ష, కుమారుడు (10), కుమార్తె కీర్తి(13) ఉన్నారు.

క్లుప్తంగా

45 టన్నుల ఇసుక సీజ్


సీజ్ చేసిన ఇసుకతో అధికారులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ సామయ్యవలస సమీపాన గోస్తనీ నది ఒడ్డున ఎడ్ల బళ్లతో బుధవారం అక్రమంగా తరలిస్తున్న 45 టన్నుల ఇసుకను ఎస్ఈబీ సీఐ రామకృష్ణ, భూగర్భ గనుల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ షేక్ సుభాని పట్టుకుని సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిని గుర్తించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయాలని నిర్ణయించారు. దాడుల్లో భూగర్భ గనుల శాఖ సిబ్బంది డి.రమేష్, ఎస్.మధు, వీఆర్ఏలు రాజు, తాతయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


తీవ్ర గాయాలతో అప్పలరెడ్డి

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీకి చెందిన గౌరుసు అప్పలరెడ్డి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు సీఐ కె.లక్ష్మణమూర్తి తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 21న సంగివలస శశి విద్యాసంస్థల సమీపంలో అప్పలరెడ్డి స్పృహ లేకుండా పడి ఉన్నాడు. స్థానికుల ఫిర్యాదుతో భీమిలి పోలీసులు 108 వాహనం సాయంతో కేజీహెచ్‌లో చేర్పించి చికిత్స అందించారు. ఈ క్రమంలో మృతిచెందాడు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు అందజేత


పిల్లలకు అందజేసిన కుర్చీలతో శేఖర్

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు వివేకానంద నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి శేఖర్ అనే వ్యక్తి 20 కుర్చీలు, ఇతర సామగ్రి అందజేశారు. అతని కుమార్తె శ్రుతి సమకూర్చిన వస్తువులను కేంద్రంలో బుధవారం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి, పిల్లల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

ముగిసిన అనంతుని కల్యాణోత్సవాలు


అనంతుని ఉత్సవ విగ్రహాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వారం రోజుల నుంచి జరుగుతున్న అనంతుని కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి శ్రీపుష్పయాగంతో ముగిశాయి. ఇందులో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ 12 సార్లు ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలోకి తీసుకెళ్లి ఉభయ దేవేరులతో అనంతునికి శ్రీ పుష్పయాగం నిర్వహించారు. 18 రకాల పుష్పాలు సమర్పించి ఈ యాగం జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో ఎస్.నానాజీ బాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, తాలాడ పద్మనాభం, తాలాడ పైడిరాజు పాల్గొన్నారు.

ఆనందాల హోలీ


ఇటుక బట్టీల యజమానులను సన్మానిస్తున్న ఒడిశా కార్మికులు


హోలీ పండగ సందర్భంగా రుషికొండ బీచ్‌లో జన సందోహం

కొమ్మాది: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని యువత రంగులతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం యువతీ, యువకులు బీచ్‌లో స్నానాలు చేసేందుకు తరలి వెళ్లారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాలు రుషికొండ, సాగర్‌నగర్, మంగమారిపేట తీరాలు బుధవారం సాయంత్రం ఒక్కసారిగా జన సందోహం పెరగడంతో కిటకిటలాడాయి.

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లోని ఇటుక బట్టీల్లో హోలీ వేడుకలను ఒడిశా కార్మికులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మద్ది, కృష్ణాపురం, పాండ్రంగి, సామయ్యవలస, ఏనుగులపాలెం గ్రామాల్లోని బట్టీల్లో ఒకరిపై ఒకరు రంగులు జల్లుకున్నారు. అనంతరం ఒడిశా కార్మికులు బట్టీల యజమానులను సన్మానించారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు రామన్నపేట సాయి రవీంద్ర పాఠశాలలో బుధవారం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్ చిన్నారులకు సర్టిఫికెట్లు, పతకాలు అందించారు. అనంతరం పాఠశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇందుమతి, లావణ్య పాల్గొన్నారు.

మారుతీ ప్రసాద్‌కి అభినందనలు


మారుతీ ప్రసాద్‌ని అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

మధురవాడ: వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల కో ఆర్డినేటర్‌గా నియమితులైన మధురవాడకి చెందిన వంకాయల మారుతీ ప్రసాద్‌ను జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం అభినందించారు. ఈయన కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యునిగా కూడా కొనసాగుతున్నారు. ప్రముఖ కళాకారుడైన మారుతీప్రసాద్‌కి ఈ అవకాశం లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాల మళ్లింపు


జాతీయ రహదారి నుంచి నిబంధనలకు విరుద్ధంగా సర్వీసు రోడ్డులోకి మళ్లుతున్న వాహనాలు

• అనుమతి లేకున్నా జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డులోకి ప్రవేశం

ఆనందపురం : జాతీయ రహదారిని ఆరు లైన్ల రహదారిగా విస్తరించిన అనంతరం తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వాహనాలు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని వెల్లంకి – వేములవలస మధ్య ఆరు లైన్ల రహదారికి అనుసంధానంగా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేశారు. ఆనందపురం జంక్షన్ నుంచి వెల్లంకితోపాటు తగరపువలస, ఇతర ప్రాంతాలకు చేరుకోవడానికి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేశారు. ఆనందపురం నుంచి వెల్లంకి మీదుగా తగరపువలస వైపు, తగరపువలస వైపు నుంచి ఆనందపురం వరకూ సర్వీసు రోడ్డులో వాహనాలు రాకపోకలు సాగించడానికి అవకాశం కలిగించారు. ఇదిలా ఉండగా వెల్లంకి వైపు నుంచి సర్వీసు రోడ్డు గుండా వచ్చే వాహనాలు నేరుగా జాతీయ రహదారిపైకి చేరుకోవడానికి అనుగుణంగా రోడ్డు నిర్మించారు. ఈ క్రమంలో జాతీయ రహదారి నుంచి ఎడమ వైపు సర్వీసు రోడ్లోకి వాహనాల ప్రవేశాన్ని నిషేధించారు. సర్వీసు రోడ్డు గుండా వచ్చే వాహనాల సౌలభ్యం కోసం ఆనందపురం జంక్షన్ వైపు మళ్లే చోట జాతీయ రహదారిని మూసివేయకుండా విడిచిపెట్టారు. ఇదే అదునుగా చాలా మంది వాహనదారులు జాతీయ రహదారి గుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించి ఎడమ వైపు ఉన్న ఆనందపురం జంక్షన్‌కు వచ్చే సర్వీసు రోడ్లోకి యూటర్న్ తీసుకుంటున్నారు. దీనివల్ల తగరపువలస నుంచి వచ్చే సర్వీసు రోడ్డు నుంచి, ఆనందపురం జంక్షన్ నుంచి వచ్చే వాహనాలతోపాటు జాతీయ రహదారి నుంచి మలుపు తీసుకునే వాహనాలు ఒకేసారి చేరుకోవడంతో గందరగోళం నెలకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఇక్కడ ప్రమాదాలు జరగడం పరిపాటయింది. ముఖ్యంగా రాత్రి వేళ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా వాహనాల రాకపోకలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


జీవీఎంసీ 3వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


జీరుపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రెండో వార్డు నాయకులు


చిట్టివలసలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల తరఫున బుధవారం తగరపువలస, చిట్టివలస పరిధిలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రెండో వార్డు చిల్లపేట, జీరుపేటలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, మునకాల ఆదినారాయణ, సరగడ శివాంజనేయరెడ్డి, డెక్కతి శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

• భీమిలి జోన్ కమిటీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ చిట్టివలసలో సీఐటీయూ నాయకులు ప్రచారం చేశారు. ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, భాగం లక్ష్మి, కె.నాగరాణి, శ్రీనివాసవర్మ, గుజ్జు సూరిబాబు, వి.నాగరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

• రామన్నపేటలో స్వతంత్ర అభ్యర్థి గిద్దలూరి విజయకుమార్ ప్రచారం చేశారు.

సుధాకర్ గెలుపుతో మరింత అభివృద్ధి

భీమునిపట్నం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరుతూ పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ 3వ వార్డులో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పరిపాలన రాజధానిగా ఏర్పాటు కానున్న నేపథ్యంలో సుధాకర్ గెలుపు ఎంతో ముఖ్యమన్నారు. ఆయన్ని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. వాసుపల్లి కొండబాబు, కె.ముత్యాలరావు, ఆర్.ప్రభాకర్‌నాయుడు, మైలపల్లి లక్ష్మణరావు, ఎర్నింటి అచ్చిబాబు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి పాల్గొన్నారు.


కళానగర్‌లో సుధాకర్‌కి మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

సుధాకర్‌ను గెలిపించి సీఎం జగన్‌కు స్వాగతం పలుకుదాం

మధురవాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి పరిపాలన రాజధానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుదామని ఆ పార్టీ నాయకులు అన్నారు.

బుధవారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు కళానగర్ పరిసర ప్రాంతాల్లో పార్టీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంచి మొదటి ప్రాధాన్యత ఓటు సుధాకర్‌కు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, చేకూరి రజని, నాయకులు పిళ్లా సూరిబాబు, పోతిన అచ్చియ్యపాత్రుడు, జగ్గుపిల్లి నరేష్, బీవీ రమణ, పిళ్లా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పిలకవానిపాలెంలో వాలీబాల్ పోటీలు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు పిలకవానిపాలెంలో పిళ్లా భరత్ కుమార్ మెమోరియల్ వాలీబాల్ పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. అలాగే ఇక్కడ రక్తదాన శిబిరం, వైద్య శిబిరం నిర్వహించారు. 120 యూనిట్ల రక్తం సేకరించారు. శిబిరాన్ని టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు ప్రారంభించారు. వాలీబాల్ విన్నర్స్‌కి రూ.15 వేలు, రన్నర్స్‌కి రూ.7వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, రావి వెంకటేశ్వరరావు, పోతిన బాలాజీ, పోతిన సోంపాత్రుడు, నాగోతి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ టైమ్ టేబుల్ బోర్డులు శిథిలం


కొమ్మాది బస్టాప్‌లో పడిపోయిన ఆర్‌టీసీ టైమ్ టేబుల్ బోర్డు

మధురవాడ: మధురవాడలో ఉన్న పలు బస్టాపుల్లో ఆర్‌టీసీ ప్రయాణికులకు బస్సుల రాకపోకల సమయం (టైమ్ టేబుల్) తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మారికవలస, కొమ్మాది, మధురవాడ, కార్‌షెడ్ తదితర చోట్ల బస్టాపుల్లో ఆర్‌టీసీ బస్సుల రాకపోకల సమాచారం ప్రయాణికులకు తెలియజేయడం కోసం బోర్డులు, చార్టులు ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడం, ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో చాలా చోట్ల పాడైపోయాయి. విరిగిపోయి శిథిలమైపోయాయి. దీంతో ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొత్తగా బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అనంతుని ఉంగరం దొంగ ఎవరు..?


భక్తుడిని తాళ్లతో కట్టి స్వామి వారి ఉంగరం గురించి విచారిస్తున్న అర్చక స్వాములు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత అనంతునికి మంగవారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం అనంతుడు ఉభయ దేవేరులతో కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం చూసే సరికి అనంతుని ఉంగరం కనిపించలేదు. దీంతో ఉంగరం కోసం స్వామి వారు పల్లకిలో గ్రామంలోకి వెళ్లారు. గ్రామ పెద్దలు కనిపించిన వారందరినీ స్వామి ఉంగరం గురించి విచారించారు. అనుమానం వచ్చిన వారందరినీ తాళ్లతో కట్టారు. గ్రామోత్సవానికి వెళ్లేటప్పుడు తిరు మంగ ఆళ్వారు (దొంగ దేవుడు) ఎదురుగా వచ్చారు. ఉంగరం గురించి తిరుమంగ ఆళ్వారును విచారించారు. తాను తీయలేదని తిరుమంగ ఆళ్వారు చెప్పారు. స్వామి వస్త్రాలను అర్చక స్వాములు వెతికారు. ఏడు వస్త్రాల్లో ఒక వస్త్రంలో ఉంగరం కనిపించింది. దీంతో తిరిగి స్వామి ఆలయానికి వెళ్లిపోయారు.